క్లుప్తంగా

క్షీరాభిషేకం

జమ్మికుంట: కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను జమ్మికుంటకు చెందిన ఓబీసీ జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఈజీఎస్ నిధుల మంజూరు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పట్టణం, మండలంలోని గ్రామాల్లో పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా నిధులు అందజేయాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని సంజయ్‌కుమార్ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు అనిల్, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, సారయ్య, శ్రీనివాస్,అశోక్, తిరుపతయ్య, రాజు, శివారెడ్డి, జగ్గారెడ్డి, జైపాల్ ఉన్నారు.

సైదాపూర్: బీజేపీ ఓబీసీ మోర్చా సైదాపూర్ ఆధ్వర్యంలో నాయకులు సంజయ్‌కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేశారు. ఓబీసీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంపత్, సతీష్, కిరణ్, శ్రీకాంత్, నాగరాజు, శ్రీనివాస్, రాజు, భిక్షపతి పాల్గొన్నారు.

గండిని పరిశీలించిన ఈఈ



గండిపడటంతో దిగువకు వెళ్తున్న నీరు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పెద్ద చెరువుకు బుధవారం గండి పడింది. మత్తడి వద్ద గతంలో గండి పడగా ఇటీవల రిటైనింగ్ వాల్ నిర్మించారు. అధికార పార్టీ నాయకులు మంగళవారం కేశవపట్నం ఎస్కేప్‌గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయడంతో నేరుగా ఎస్సారెస్పీ నీరు పెద్ద చెరువులోకి చేరింది. రిటైనింగ్ వాల్ మత్తడి కట్ట చివరి వరకు నిర్మించకపోవడంతో ఎస్కేప్‌గేట్ల నుంచి వచ్చిన సాగునీటి మట్టం పెరిగి మత్తడి వద్ద కట్ట కోతకు గురై గండి పడిందని ఆయకట్టు రైతులు ఆరోపించారు. చెరువులోని నీరంతా దిగువకు వెళ్తోంది. గండిని ఎస్సారెస్పీ ఈఈ నాగభూషణం, డీఈ కవిత పరిశీలించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



అభినందిస్తున్న హెచ్‌ఎం రాజిరెడ్డి

చొప్పదండి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ భీమేశ్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి జిల్లా జట్టు తరుపున పాఠశాలకు చెందిన భీమేశ్‌తో పాటు సీహెచ్ కృష్ణ, టి.తరుణ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించారు. ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు పి. మమత, సీహెచ్ ఐశ్వర్య ప్రాతినిధ్యం వహించి వెండి పతకం సాధించారు. విద్యార్థితో పాటు ఫిజికల్ డైరెక్టర్ కె.కృష్ణను హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి అభినందించారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



ఖాతా బుక్కు అందిస్తున్న మేనేజర్ బెనర్జీ

చొప్పదండి: విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆన్‌లైన్ మోసాలు, లావాదేవీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సబ్సిడీ రుణాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. అనంతరం బ్యాంకు అధికారి కె. బెనర్జీకృష్ణ చెక్‌బుక్స్, డీడీ, ఇతర అంశాలను వివరించారు. ప్రతి విద్యార్థికి బ్యాంకు అకౌంట్ ఉండాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు లక్ష్మణ్, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అనవసర మెసేజ్‌లకు స్పందించొద్దు

చిగురుమామిడి: సామాజిక మాధ్యమాల్లో తెలియని మెసేజ్‌లకు స్పందించొద్దని ఎస్సై బి. రాజేశ్ సూచించారు. చిగురుమామిడి కేజీబీవీలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని కట్టడికి ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలగాలని కోరారు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీ అడిగితే నమ్మొద్దని, 1930కి డయల్ చేయాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్సై జగదీష్, పోలీసు సిబ్బంది, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాతర్లపల్లి నుంచి, సిరిసేడు క్రాస్ వద్ద బస్సు దిగి వెళ్తున్న గ్రామస్తులు

- ఇల్లందకుంట మండలంలోని పలు గ్రామాలకు బస్సుసౌకర్యం కరువు
- ఇబ్బందులు పడుతున్న స్కూల్, కాలేజీ విద్యార్థులు, ప్రజలు
- అధికారులు, పాలకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోని వైనం

బస్సులు రావు.. బాధలు తీరవు

ఇల్లందకుంట: మండలంలోని పాతర్లపల్లి, వంతడ్పుల గ్రామాలతోపాటు వివిధ పల్లెలకు బస్సుసౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాతర్లపల్లికి మూడుసార్లు బస్సులు వచ్చేవి. ప్రస్తుతం జమ్మికుంట నుంచి వయా మొట్లపల్లి, పాతర్లపల్లి మీదుగా పరకాలకు ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు సర్వీసు ఉంది. గతంలో వంతడ్పుల మీదుగా దుబ్యాల వరకు ఆరుసార్లు బస్సులు వచ్చేవి. కానీ ప్రస్తుతం జమ్మికుంట నుంచి వంతడ్పుల మీదుగా దుబ్యాల, రాఘవరెడ్డిపేట వరకు ఉదయం, సాయంత్రం ఒక సర్వీస్ నడుస్తోంది. బస్సు సదుపాయం లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నామని, కొన్నిసార్లు కాలినడకన కిలోమీటర్ల మేర నడవాల్సివస్తోందని వాపోతున్నారు. మట్టిరోడ్డు ఉన్నప్పుడు బస్సులు వచ్చేవి కానీ బీటీరోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు రాని పరిస్థితి నెలకొందని, గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని అధికారులు, పాలకులను కోరినా పట్టించుకోవడంలేదని, చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో గ్రామాలకు బస్సులు నడిపించాలని మహిళలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి



గతంలో రోజుకు మూడుసార్లు బస్సు వచ్చేది. బస్సు సౌకర్యం కల్పించాలని ఏళ్లుగా ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు, రవాణాశాఖ మంత్రి స్పందించాలి.
– బైరెడ్డి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్, పాతర్లపల్లి

బస్సు సౌకర్యం కల్పించాలి



అధికారులు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. బస్సులు రాక విద్యార్థులు, ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. లేదంటే కాలినడకన వెళ్తున్నారు. పాలకులు, అధికారులు సమస్య పరిష్కరించాలి.
– మ్యాదడ తిరుపతిరెడ్డి, వంతడ్పుల

మూడు కిలోమీటర్లు నడవాలి



గ్రామం నుంచి సిరిసేడు క్రాస్ వద్దకు వచ్చి బస్సు ఎక్కాలి. బస్సులు రాకపోవడంతో చాలా మంది ద్విచక్రవాహనాలపై పిల్లలను పాఠశాలల దింపేసి వెళ్తున్నారు. కూలీలు పనులకు సకాలంలో వెళ్లలేక పోతున్నారు.
– రాం సమ్మక్క, పాతర్లపల్లి

మహిళా ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: మహిళా ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం వివిధ పథకాలతో మహిళలకు ఆర్థిక చేయూత అందిస్తోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో మరమ్మతు పనులను, యూనిఫాంల బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. మండలంలో నాలుగు ఎకరాల్లో సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని, ప్రభుత్వ భూమి గుర్తించి కలెక్టర్‌కు ప్రపోజల్ పంపించాలని తహసీల్దార్‌కు సూచించారు. స్వశక్తి సంఘంలోని మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.పది లక్షల బీమా సౌకర్యం కల్పించిదన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ అనుపమరావు, ఎంపీడీవో రాము, తదితరులు పాల్గొన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయలని నారాయణపూర్, చుట్టుపక్కల గ్రామాల రైతులు ఎమ్మెల్యేను వేడుకున్నారు. నాలుగు రోజుల్లో నీటిని విడుదల చేయనున్నట్లు రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే సత్యం

రామడుగు: సమస్యలను పరిష్కరించాలని చొప్పదండి నియోజకవర్గంలోని పలువురు ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహమ్మద్ ఆసిఫ్, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సతీశ్‌బాబు, తదితరులు

హుజూరాబాద్: కిట్స్ కళాశాలలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆరురోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్ వాల్‌పోస్టర్‌ను కళాశాల చైర్మన్ కెప్టెన్ వొడితెల లక్ష్మీకాంతారావు, సెక్రటరీ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. అడ్వాన్స్‌డ్ ఇన్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ విభాగంలోని వర్క్‌షాప్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అధ్యాపకులు పరిశ్రమల్లోని సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించాలన్నారు. డైరెక్టర్ కె.శంకర్, ప్రిన్సిపాల్ కె.ఈశ్వరయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సతీశ్‌కుమార్, ప్రొఫెసర్ మల్లయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

♦ సీపీఐ బలోపేతానికి ముందుకు కదలాలి

చిగురుమామిడి: సీపీఐ బలోపేతానికి పార్టీ శ్రేణులు ముందుకు కదలాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ముస్కురాజిరెడ్డి స్మారకభవనంలో పార్టీ గ్రామశాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు గంగ్రత్ భీమయ్య ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందడం బాధాకరమని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. భీమయ్య మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు. ముప్పై ఏళ్లుగా పార్టీలో పనిచేశాడని మృతుడి కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందన్నారు.

♦ రజతోత్సవం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో యజ్ఞశాల ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈసందర్భంగా దేవాలయంలో రజోత్సవం వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

♦ ముందస్తు సంక్రాంతి వేడుకలు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

♦ కొత్త మండలాలు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలో కొత్తగా నాలుగు మండలాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాదులోని స్వగృహంలోమాట్లాడారు. ఉప్పల్, శనిగరం, వావిలాల, చల్లూరును మండలాలుగా ఏర్పాటు చేయడానికి కావాల్సిన అర్హతలున్నాయన్నారు.

♦ అవార్డుల ప్రదానం

చిగురుమామిడి: చిగురుమామిడి మండల కళాకారుల కమిటీ చైర్మన్ శ్రీరామోజు రాజ్‌కుమార్, సహాయకార్యదర్శి మల్లం బాలయ్యకు కలెక్టర్ పమేలాసత్పతి గ్రామీణ కళాజ్యోతి జీవన సాఫల్యం అవార్డులను కరీంనగర్‌లోని కళాభారతిలో ప్రదానం చేశారు. మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వీరిని ఘనంగా సన్మానించారు. ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ భాషా సంస్కృతిక సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

♦ దాడిని ఖండిస్తున్నాం

జమ్మికుంట: బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని విలేకర్లతో మాట్లాడారు.

♦ నానమ్మ పాడె మోసిన మనవరాళ్లు

శంకరపట్నం: నానమ్మ మృతిచెందగా మనవరాళ్లు పాడె మోసిన సంఘటన బుధవారం మండలంలోని తాడికల్ గ్రామంలో చోటుచేసుకుంది. మొలుగూరి లక్ష్మిరాజమౌళికి ఇద్దరు కొడుకులు, కూతురు. వృద్ధాప్య సమస్యలతో లక్ష్మి మృతిచెందగా చిన్నకుమారుడి ఐదుగురు కూతుళ్లు అంత్యక్రియల్లో భాగంగా పాడెను మోయగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

♦ నేత్రదానంపై అవగాహన

జమ్మికుంట: ఇటీవల మృతిచెందిన డాక్టర్ జీడి అంకూస్ నేత్రాలను సదాశయ ఫౌండేషన్‌కు కుటుంబ సభ్యులు దానం చేశారు. పట్టణంలోని పద్మశాలీ భవనంలో బుధవారం సంస్మరణ సభ నిర్వహించగా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, ప్రముఖ కంటి వైద్యుడు శ్రీనివాస్‌రెడ్డి నేత్రదానంపై అవగాహన కల్పించి కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేసి, మృతుడి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

♦ అనుచిత వ్యాఖ్యలు సహించం

హుజూరాబాద్: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు సహించమని యూత్ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. వయనాడ్ ఎంపీ ప్రియాంకగాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బీదూరి వ్యాఖ్యలను ఖండించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రమేశ్‌బీదూరి, ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

తిమ్మాపూర్: మాజీ ఎంపీ రమేష్ భూదురి దిష్టిబొమ్మను కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ ప్రధాన చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు.

♦ సాగునీరు అందించాలి

వీణవంక: కల్వల ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరందించాలని మండలంలోని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

♦ బాలుర వసతి గృహం తనిఖీ

వీణవంక: మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని ప్రత్యేకాధికారి సీపీవో కొంరయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట శాల, స్టోర్ రూం, పిల్లల వసతి ఎలా ఉందో వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. మంచినీటి వసతి కల్పించాలని విద్యార్థులు అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడి వసతి కల్పించాలని సూచించారు.

♦ ఆర్ఐపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చిగురుమామిడి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన సన్నకారు రైతు జక్కుల రాములు ఆర్ఐ సంతోష్‌కుమార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కరెంటు మంజూరు కోసం సంతకం చేయాలని కోరగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తక్షణం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఆర్ఐని వివరణ కోరగా పథకం ప్రకారం బూతులు తిట్టాడని, సస్పెండ్ చేయిస్తానంటూ అవమానించాడని తెలిపారు.

♦ పీడీఎస్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్: పట్టణంలోని విద్యానగర్‌లో ఓ కిరాణషాపులో ఉన్న రెండు క్వింటాళ్లకుపైగా రేషన బియ్యాన్ని పట్టుకున్నట్లు డిప్యూటీ సివిల్ అధికారి వసంతరావు తెలిపారు. రేషనబియ్యం అక్రమంగా నిల్వచేశారనే సమాచారంతో దాడులు చేశామన్నారు.

♦ చెక్కులు పంపిణీ

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లిలో బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలతో పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నాయకులు పంపిణీ చేశారు.

♦ కేశవపట్నం చేరిన సైకిల్‌యాత్ర

శంకరపట్నం: ఉద్యమకారుల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కరీంనగర్ పట్టణానికి చెందిన ఉద్యమకారుడు కుడిది శ్రీనివాస్ చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం కేశవపట్నం చేరింది.

♦ ఆయిల్‌పామ్ తోటల సందర్శన

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్, వల్భాపూర్ గ్రామాలలోని ఆయిల్‌పామ్ తోటలను జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి శ్రీనివాసరావు సందర్శించారు.

♦ స్థల పరిశీలన

సైదాపూర్: వెన్నంపల్లిలో సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని బుధవారం డీఆర్‌డీవో శ్రీధర్ పరిశీలించారు.

♦ వివేకానంద జయంతి

రామడుగు: మండల కేంద్రంలోని శ్రీభక్తమార్కండేయ దేవాలయంలో బుధవారం ధర్మ జాగరణ విభాగం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు.

♦ ఉరేసుకొని, చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం: మండలంలో తాడికల్‌కి చెందిన బాషామియా(65) ఉరేసుకొని, ఇప్పలపల్లికి చెందిన కామెర బాలమ్మ(70)చికిత్స పొందుతూ మృతిచెందారని గ్రామస్తులు తెలిపారు. డిసెంబర్ 11న బాలమ్మ వంట చేస్తూ అగ్నిప్రమాదానికి గురైంది.



ఘనంగా దీపోత్సవం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవెంకటాద్రినగర్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సవంలో భాగంగా బుధవారం దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు హరికృష్ణమాచార్యులు, వేణుగోపాలచార్యులు వేద మంత్రోచ్చరణల మధ్య గోదాదేవి, రంగనాథస్వామికి కల్యాణం కన్నుల పండుగగా జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ముక్క జితేంద్రగుప్తా, భక్తులు పాల్గొన్నారు.



మానకొండూర్: మానకొండూర్ శివారులోని మానకొండూర్– జమ్మికుంట రోడ్డు వెంబడి వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. బావులు చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోపాటు గోడలు నిర్మించలేదని, భయం భయంగా ప్రయాణం చేస్తున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చానగొండ రాజశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్ నంబర్ : 9440818867

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ప్రజల సహకారం మరువలేనిది



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గందె రాధిక

హుజూరాబాద్: మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఆఖరి నిర్వహించిన కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడారు. ఐదేళ్లలో పట్టణ అభివృద్ధికి ప్రజలు, పాలకవర్గ సహకారం మరువలేనదని, గత ప్రభుత్వం ఎంతో కృషిచేసిందని, వార్డులలో సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణంతో పాటు పారిశుధ్యం కోసం సిబ్బంది ఎల్లవేళలా పనిచేశారని పేర్కొన్నారు. సమావేశంలో 53 అంశాలను ప్రతిపాదించగా అన్ని అంశాలకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వార్డు సభ్యులు, కార్యాలయ మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి మున్సిపల్ ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ అశ్వినీగాంధీ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. కిషన్‌రావు, సీనియర్ సహాయకులు ఎండీ రషీద్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్,నాయకులు

హుజూరాబాద్: ఎన్పీఎస్, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా)జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్జీవోశాఖ అధ్యక్షుడు సరేందర్ ఆధ్వర్యంలో టాప్రా డైరీ, క్యాలెండర్‌ను తహసీల్దార్ కనకయ్యతో కలిసి ఆవిష్కరించారు. సింగరేణి కార్మికులకు కనీసం రూ.15వేల పెన్షన్ అందించాలని, నూతన పీఆర్సీని జూలై 2023 నుంచి అమలు చేస్తూ, నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేఖర్, టాప్రా సభ్యులు వెంకటయ్య, సయ్యద్ మునీరుద్దీన్, రామకృష్ణయ్య, సమ్మయ్య, వీరస్వామి, మల్లారెడ్డి, గొట్టే జమదగ్ని, గంగిశెట్టి సాంబయ్య, తాటిపాముల కనుకయ్య, శ్రీహరి, తాళ్లపల్లి రామకృష్ణ, మునిగంటి రవీందర్, ముక్క మొగిలయ్య, చింత సమ్మయ్య పాల్గొన్నారు.

మొబైల్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయొద్దు



వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వేణు

హుజూరాబాద్: మొబైల్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయొద్దని ఎంవీఐ కంచి వేణు అన్నారు. బుధవారం పట్టణంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భగా వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనం నడపొద్దని, ఇన్సూరెన్స్ రెన్యువల్, ట్యాక్స్, పొల్యూషన్ రికార్డులు వెంట ఉండాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. నియమాలు ఉల్లంఘించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని, తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబల్ నాగరాజు, హోంగార్డ్ గుర్రం శ్రీకాంత్, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల 'మాక్ అసెంబ్లీ'



జమ్మికుంట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. విద్యార్థులు స్పీకర్, సీఎం, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు, శాసన సభ్యులుగా పర్యావరణం, పాఠశాలలోని వసతులు, ఇతర సామాజిక సమస్యలపై చర్చించారు. శాసనసభ నిర్వహణలోని చాలా అంశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పనితీరును తెలుసుకోగలిగామని విద్యార్థులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బి.ఐలయ్య, సారంగపాణి, భాగ్యలక్ష్మి, రమాదేవి, శ్రీలత, సతీష్, రమేశ్‌చారి, సారయ్య, వీరాచారి విద్యార్థులను అభినందించారు.